
సాక్షి విశాఖపట్నం

మంగళవారం । 22 । ఏప్రిల్ । 2025



సేవక.. సైనిక 8లో



నేటి నుంచి రైల్వే వేసవి క్రీడా శిక్షణా శిబిరాలు 8లో



సమస్యల పరిష్కారంపై దృష్టి 8లో

న్యూస్‌రీల్

న్యూరోసర్జరీ విభాగానికి వైద్య పరికరాల అందజేత



పరికరాలను సూపరింటెండెంట్‌కు అందజేస్తున్న బాలపరమేశ్వరరావు కుటుంబ సభ్యులు

దాబాగార్డెన్స్: కేజీహెచ్‌లోని న్యూరో సర్జరీ విభాగానికి రూ.8 లక్షల విలువ గల వైద్య పరికరాలను డాక్టర్ సుంకర బాలపరమేశ్వరరావు కుటుంబ సభ్యులు సుంకర ఆదిలక్ష్మి, సుబ్బలక్ష్మి, డాక్టర్ ఎస్‌జే బాలపరమేశ్వరరావు(న్యూరో సర్జన్), సుంకర రాజగోపాల్ సోమవారం విరాళంగా అందజేశారు. ఈ మేరకు కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద్ బాలపరమేశ్వరరావు కుటుంబ సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో బాలపరమేశ్వరరావు కుటుంబ సభ్యులతో పాటు కేజీహెచ్ న్యూరో సర్జరీ విభాగాధిపతి డాక్టర్ ప్రేమ్‌జిత్‌రే, ఇతర న్యూరో సర్జరీ వైద్యులు పాల్గొన్నారు. ఈ వార్డుకు గత నెల 17వ తేదీన ప్రముఖ న్యూరోసర్జన్ డాక్టర్ సుంకర బాలపరమేశ్వరరావు న్యూరోసర్జరీ వార్డుగా నామకరణం చేసిన విషయం విదితమే.

రేపటి నుంచి డిగ్రీ పరీక్షలు



విశాఖ విద్య: ఆంధ్ర యూనివర్సిటీ డిగ్రీ రెండు, నాల్గవ సెమిస్టర్ పరీక్షలు ఈ నెల 23 నుంచి ప్రారంభంకానున్నాయి. ఇందుకు సంబంధించి ఏర్పాట్లు పూర్తి చేశామని వర్సిటీ రిజిస్ట్రార్ ఇ.ఎన్.ధనుంజయరావు వెల్లడించారు. బీఏ, బీకాం, బీఎస్సీ, బీబీఏ, బీసీఏ, బ్యాచిలర్ ఆఫ్ ఒకేషనల్, బీహెచ్ఎంసీటీ కోర్సులు చదువుతున్న 51,400 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. సెకండ్ సెమిస్టర్ హానర్స్, సప్లిమెంటరీ విద్యార్థులకు ప్రతీ రోజూ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష నిర్వహించనున్నారు. నాల్గో సెమిస్టర్ హానర్స్, సప్లిమెంటరీ విద్యార్థులకు ప్రతీ రోజూ మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్ష ఉంటుంది.

ముంబయికి వీఎంఆర్‌డీఏ కమిషనర్

విశాఖ సిటీ : వీఎంఆర్‌డీఏ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్ సోమవారం ముంబయికి వెళ్లారు. రెండురోజుల పాటు ముంబయి మెట్రోపాలిటన్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ(ఎంఎంఆర్‌డీఏ) కార్యకలాపాలపై అధ్యయనం చేయనున్నారు. అక్కడి అధికారులతో సమావేశమవడంతో పాటు ఎంఎంఆర్‌డీఏ చేస్తున్న ప్రాజెక్టులను సందర్శించనున్నారు. ఇందుకు సంబంధించి ప్రభుత్వం అనుమతిస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్‌కు వీఎంఆర్‌డీఏ కమిషనర్‌గా అదనపు బాధ్యతలు అప్పగించింది.

డీఐఈవోల నియామకం

విశాఖ విద్య: విశాఖ, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాలకు ఇంటర్మీడియెట్ ఎడ్యుకేషన్ అధికారులను ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు ఇంటర్మీడియెట్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. విజయనగరం జిల్లా గుర్ల ప్రభుత్వ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న ఆర్.సురేష్‌కుమార్‌ను పదోన్నతిపై విశాఖ జిల్లా ఇంటర్మీడియెట్ ఎడ్యుకేషన్ అధికారిగా నియమించారు. అలాగే రాజమండ్రి కేంద్రంగా ఇంటర్మీడియెట్ విద్య రీజినల్ డైరెక్టర్‌గా అదనపు బాధ్యతలు నిర్వహించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కాగా డీవీఈవోగా విశాఖలో పనిచేస్తున్న బి.రాధను అనకాపల్లి జిల్లా డీఐఈవోగా పూర్తి అదనపు బాధ్యతలతో నియమించారు. విజయనగరం డీవీఈవోగా పనిచేస్తున్న కొత్తవలస ప్రభుత్వ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ ఎస్.బి.శంకర్‌రావును అల్లూరి సీతారామరాజు జిల్లా డీఐఈవోగా నియమించారు.

24 నుంచి టీచర్స్‌కు మెడికల్ క్యాంపులు

విశాఖ విద్య : ఉపాధ్యాయుల బదిలీల కోసం.. వైద్య సంబంధిత ధ్రువీకరణ పత్రాల జారీకి ప్రత్యేక మెడికల్ క్యాంపులు నిర్వహించనున్నట్లు ఉమ్మడి విశాఖ జిల్లా నోడల్ అధికారి ఎస్.ప్రేమ్ కుమార్ తెలిపారు. కేజీహెచ్, ప్రభుత్వ మెంటల్ ఆస్పత్రి, ప్రభుత్వ ఈఎస్‌టీ ఆస్పత్రిలో వైద్యులు అందుబాటులో ఉంటారన్నారు. ఈ నెల 24న విశాఖ, 25న అనకాపల్లి, 26న అల్లూరి జిల్లాల ఉపాధ్యాయులు హాజరుకావాలన్నారు. గతంలో పొందిన వైద్య సంబంధిత ధ్రువపత్రాలను కూడా వెంట తీసుకురావాలన్నారు. త్వరలో జరగనున్న ఉపాధ్యాయ బదిలీల్లో వైద్య పరమైన కేటగిరీ పాయింట్లు పొందేందుకు తప్పనిసరిగా జిల్లా స్థాయి మెడికల్ బోర్డుచే కొత్తగా సర్టిఫికెట్ తీసుకోవాలన్నారు.

భానుడు భగభగ.. మీటర్ గిరగిర!

- మండుతున్న ఎండలతో పెరుగుతున్న విద్యుత్ వినియోగం
- విశాఖ సర్కిల్ పరిధిలో రోజూ సాధారణ వినియోగం 12 మిలియన్ యూనిట్లు
- మధ్యాహ్నం 1-3 గంటలు, రాత్రి 10 గంటల తర్వాత పీక్‌లోడ్
- ప్రస్తుతం 14-15 మిలియన్ యూనిట్లకు చేరిక
- డిమాండ్‌కు అనుగుణంగా సరఫరా చేసేందుకు ఈపీడీసీఎల్ అష్టకష్టాలు
- ఒక్కసారిగా లోడ్ పెరగడంతో సరఫరాలో లోపాలు



సాక్షి, విశాఖపట్నం: ఎండలు మండిపోతున్నాయి. ఉష్ణోగ్రతలు తారాస్థాయికి చేరుకుంటున్నాయి. ఉక్కబోతతో జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. వేడి నుంచి ఉపశమనం పొందడానికి అంతా ఫ్యాన్లు, కూలర్లు, ఏసీలు విపరీతంగా వినియోగిస్తున్నారు. ఈపీడీసీఎల్ పరిధిలో విద్యుత్ వినియోగం రికార్డు స్థాయికి చేరుకుంటోంది. సాధారణంగా ఉమ్మడి విశాఖ జిల్లాలో మార్చి మూడో వారం నుంచి నుంచి ఉష్ణోగ్రతలు పెరుగుతుండటంతో కరెంటు వినియోగం కూడా పెరుగుతుంటుంది. కానీ ఈసారి ఫిబ్రవరి రెండో వారం నుంచి ఎండలు మండిపోతున్నాయి. అప్పటి నుంచి డిమాండ్ పీక్స్‌కు వెళ్లిపోయింది. డిమాండ్‌కు అనుగుణంగా విద్యుత్ సరఫరా చేసేందుకు అధికారులు అష్టకష్టాలు పడుతున్నారు. లోడ్ పెరుగుతుండటంతో సరఫరాలోనూ లోపాలు తలెత్తుతున్నాయి.



ఆ గంటల్లో.. మంటలే..!

ఇక మిట్ట మధ్యాహ్నం సమయంలో నడి నెత్తిన సూరీడు తాండవమాడుతున్న సమయంలో విద్యుత్ వినియోగం గరిష్ట స్థాయికి చేరుకుంటోంది. అదేవిధంగా రాత్రి 10 గంటల సమయంలోనూ డిమాండ్ పెరుగుతోంది. ఈ సమయంలో సరఫరా కంటే 3 నుంచి 5 మెగావాట్లు అధికంగా వినియోగిస్తున్నారు.

తేదీ	మధ్యాహ్నం 1 గంటకు వినియోగం (మెగావాట్లలో)	రాత్రి 10 గంటలకు వినియోగం (మెగావాట్లలో)
17-ఏప్రిల్	25.464	29.246
18-ఏప్రిల్	26.741	29.952
19-ఏప్రిల్	27.552	30.434
20-ఏప్రిల్	27.857	31.272

2 మిలియన్ యూనిట్లు అదనంగా...

విశాఖ సర్కిల్ పరిధిలో ప్రతి రోజూ సగటున 12 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం జరగుతుంది. అయితే భానుడి ప్రతాపంతో విద్యుత్ వినియోగం గణనీయంగా పెరిగిపోయింది. గత కొద్ది వారాలుగా సగటు విద్యుత్ వినియోగం రోజుకు 14 నుంచి 15 మిలియన్ యూనిట్లుగా మారిపోయింది. ఏప్రిల్ 1న రికార్డు స్థాయిలో 15.976 మిలియన్ యూనిట్లు విద్యుత్ వాడేశారంటే.. ఎండ తీవ్రత నుంచి రక్షించుకునేందుకు ప్రజలు ఎంతలా కరెంట్ వినియోగిస్తున్నారో అర్థం చేసుకోవచ్చు. గత వారం రోజులుగా పరిశీలిస్తే ఏ రోజూ 14 మిలియన్ యూనిట్లకు దిగువన రీడింగ్ లేదు.



తేదీ	వినియోగం (మిలియన్ యూనిట్లలో)
15- ఏప్రిల్	14.196
16- ఏప్రిల్	14.464
17- ఏప్రిల్	15.612
18- ఏప్రిల్	15.060
19- ఏప్రిల్	15.074
20- ఏప్రిల్	14.454


డిమాండ్‌కు అనుగుణంగా సరఫరా చేస్తున్నాం..



రోజు రోజుకీ ఎండలు పెరిగిపోతున్నాయి. దానికనుగుణంగా విద్యుత్ వినియోగం కూడా పెరుగుతోంది. పెరిగిన విద్యుత్ కనెక్షన్లు, వాటి డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని విద్యుత్ సరఫరా చేస్తున్నాం. మే నెలలో మరింత ఎక్కువగా డిమాండ్ ఉండబోతోంది. దానికోసం ఉన్నతాధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఒకే సమయంలో అందరూ ఏసీలు, కూలర్లు ఆన్ చేస్తుండటంతో కొన్ని ప్రాంతాల్లో లోడ్ పెరిగి ట్రిప్ అవుతూ సరఫరాకు అంతరాయం ఏర్పడుతోంది. దీన్ని కూడా తక్కువ సమయంలోనే పరిష్కరిస్తున్నాం. ఎంత అవసరమైనా కోతలు లేకుండా విద్యుత్ అందించేందుకు ఇప్పటి నుంచే ఏర్పాట్లు చేస్తున్నాం.

– శ్యామ్‌బాబు, ఈపీడీసీఎల్ విశాఖ సర్కిల్ ఎస్ఈ

గరిష్ట స్థాయికి చేరుకుంటున్న డిమాండ్



ఉమ్మడి విశాఖ సర్కిల్(అనకాపల్లి, అల్లూరి జిల్లాలు)లో విద్యుత్ వినియోగం రోజు రోజుకూ పెరుగుతోంది. అందుకనుగుణంగా విద్యుత్ సరఫరాకు ఆటంకం కలగకుండా చర్యలు తీసుకునేందుకు ఈపీడీసీఎల్ అధికారులు అష్టకష్టాలు పడుతున్నారు. ఉమ్మడి విశాఖ సర్కిల్ పరిధిలో సగటు వినియోగం 24 నుంచి 25 మిలియన్ యూనిట్లుగా ఉంది. ప్రస్తుతం 26 నుంచి 27 మిలియన్ యూనిట్లకు పైగా కరెంట్ ఖర్చవుతోంది. సరఫరాకు మించి వినియోగం ఉండటంతో అధికారులు లోటు భర్తీ చేసేందుకు ఎప్పటికప్పుడు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అనకాపల్లి జిల్లాల్లో లలితా త్రిపురసుందరీ ఫెర్రో అల్లాయిస్, అభిజిత్ ఫెర్రో అల్లాయిస్ వంటి భారీ పరిశ్రమలకు రాష్ట్ర ప్రభుత్వం రాయితీలు ఇవ్వకపోవడంతో మూతపడ్డాయి. ఈ కారణంగా విద్యుత్ డిమాండ్ భారీగా తగ్గింది లేదంటే.. 28 నుంచి 30 మిలియన్ యూనిట్లకు చేరుకునే అవకాశం ఉండేదని అధికారులు చెబుతున్నారు.



తేదీ	సరఫరా (మిలియన్ యూనిట్లలో)	వినియోగం (మిలియన్ యూనిట్లలో)	అదనపు లోడు (మిలియన్ యూనిట్లలో)
17-ఏప్రిల్	25.743	26.378	0.635
18-ఏప్రిల్	24.762	26.691	1.924
19-ఏప్రిల్	26.000	27.045	1.045
20-ఏప్రిల్	25.806	26.786	0.980

ఇంతలోనే.. అంత మార్పా..!

- కాలుష్య నియంత్రణ చర్యలకు తూట్లు
- వ్యక్తిగత వాహనాలపైనే అధికారుల రాకపోకలు
- గేట్ నుంచి మాత్రం నడుచుకుంటూ చాంబర్లకు చేరిన వైనం



ప్రధాన ద్వారం వద్ద అదనపు కమిషనర్ వాహనం



జీవీఎంసీ ఉత్తర భాగంలో పార్కింగ్ చేసిన అధికారుల వాహనాలు

దాబాగార్డెన్స్: కాలుష్య రహిత నగరంగా విశాఖను తీర్చిదిద్దేందుకు నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి ఎంతగానో కృషి చేశారు. మేయర్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన తర్వాత వారంలో ఓ రోజు(ప్రతి సోమవారం) తన క్యాంప్ కార్యాలయం నుంచి ప్రత్యేక వాహనాన్ని వదిలి, ప్రజా రవాణా వ్యవస్థ(ఆర్టీసీ) బస్సులో జీవీఎంసీకి చేరుకునేవారు. కాలుష్య నియంత్రణకు ఉద్యోగులతో పాటు విశాఖ నగర పౌరులు కూడా సహకరించాలని ప్రతి వారం పిలుపునిచ్చేవారు. వారంలో ఒక రోజు వ్యక్తిగత వాహనాలు వీడి, ప్రజా రవాణాను వినియోగించాలని సూచించేవారు. అందుకు చిత్తశుద్ధితో ప్రయత్నించారు. ఇప్పుడిదంతా గతం.. కానుంది.

మేయర్ పీఠం మారదంతో..

కూటమి కార్పొరేటర్లు, నేతలు కుట్రలు, కుతంత్రాలతో అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టి మేయర్ పీఠాన్ని దక్కించుకున్నారు. ఇంకేముంది.. అధికారుల తీరు మారింది. కాలుష్య నియంత్రణపై మేయర్ పిలుపును పక్కన పెట్టేశారు. ఎలాగూ మేయర్ లేరన్న ధీమాతో దర్జాగా జీవీఎంసీ తమకు కేటాయించిన వాహనాల్లోనే ఇళ్ల వద్ద బయల్దేరి, కార్యాలయానికి చేరుకున్నారు. గేట్ వద్ద వాహనం దిగి, ఆ పది మీటర్లు మాత్రం నడిచి, ప్రధాన కార్యాలయం లోపలికి చేరుకున్నారు. పైకి కాలినడకన వస్తున్నట్లు బిల్డప్ ఇస్తున్న అధికారుల తీరు తొలి వారమే బట్టబయలైంది.

గేటు ముందు వాహనం దిగి..

వాస్తవంగా సోమవారం నో వెహికల్ డే. దీంతో ఇళ్ల వద్ద నుంచే వ్యక్తిగత వాహనాలను వీడాలి. అయితే మన అధికారులు మాత్రం మేయర్ పీఠం మారనుండటంతో.. కొత్త మేయర్ పదవీ బాధ్యతలు స్వీకరించి, ఆదేశాలివ్వకముందే.. కాలుష్య నియంత్రణ చర్యలకు తూట్లు పొడిచారు. ఇంటి నుంచే వాహనాల్లో దర్జాగా జీవీఎంసీ ప్రధాన కార్యాలయ వద్ద దిగారు. ఆ గేట్ నుంచి నడుచుకుంటూ కార్యాలయంలోకి చేరారు. ఆ వాహనాలను డ్రైవర్లు జీవీఎంసీ కార్యాలయం చుట్టూ పార్కింగ్ చేశారు. మధ్యాహ్న భోజన సమయంలో కూడా కొందరు తమ వాహనంలో ఇంటికి వెళ్లి, వచ్చారు. సాయంత్రం విధులు ముగించుకుని మళ్లీ వాహనాల్లోనే హుందాగా ఎవరింటికి వారు చేరుకున్నారు.

వైద్య కళాశాలలు ప్రైవేట్‌పరం

బాధ్యతారాహిత్యం

- ఆంధ్రప్రదేశ్ ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ పూర్వ కార్యదర్శి డాక్టర్ పీవీ రమేష్



మాట్లాడుతున్న ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ పూర్వ కార్యదర్శి డాక్టర్ పీవీ రమేష్

దాబాగార్డెన్స్: ప్రజారోగ్యం ప్రభుత్వ బాధ్యతని, ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేట్‌పరం చేయడం ప్రభుత్వ బాధ్యతా రాహిత్యమని ఆంధ్రప్రదేశ్ ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ పూర్వ కార్యదర్శి డాక్టర్ పీవీ రమేష్ అన్నారు. అల్లూరి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం ఆంధ్రప్రదేశ్‌లో ఆరోగ్య రంగం..మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ అనే అంశంపై డాక్టర్ హరిప్రసాద్ స్మారక ఉపన్యాసం నిర్వహించారు. ప్రభుత్వాలు మారుతున్నా ఆరోగ్య రంగంలో మార్పులు రావడం లేదని, ప్రైవేట్ రంగానికి వైద్యం అప్పగించడం ఆందోళనకరమన్నారు. కేరళ ఆరోగ్య రంగంలో ఆదర్శంగా ఉందని, అక్కడ మరణాల రేటు తక్కువగా, వైద్య సౌకర్యాలు మెరుగ్గా ఉన్నాయని తెలిపారు. ఏపీ ప్రభుత్వం తన బాధ్యతను విస్మరిస్తోందని, పీపీపీ పద్ధతిలో మెడికల్ కళాశాలలు ఏర్పాటు చేయడం, క్యాపిటేషన్ ఫీజు వసూలు చేయడం సమర్థనీయం కాదన్నారు. ప్రభుత్వ కళాశాలల కంటే ప్రైవేట్ కళాశాలల సంఖ్య ఎక్కువగా ఉండటం దారుణమన్నారు. వైద్య విద్యా మాజీ డైరెక్టర్ డాక్టర్ కె.సత్య వరప్రసాద్ మాట్లాడుతూ కార్పొరేట్ వైద్యం పరీక్షల పేరుతో ప్రజల నుంచి కోట్లాది రూపాయలు వసూలు చేస్తోందని దుయ్యబట్టారు. ఐదు జిల్లా ఆసుపత్రుల్లో ఐసీయూలు లేవని, వైద్య రంగంలో సేవా దృక్పథం తగ్గి వ్యాపార కాంక్ష పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. పీపీపీ పద్ధతిలో ప్రైవేటీకరణ జరిగితే ఫీజులు పెరిగిపోతాయని, రిజర్వేషన్లు తగ్గిపోతాయని, పేద విద్యార్థులకు వైద్య విద్య అందుబాటులో ఉండదని డాక్టర్ ఎంవీ రమణయ్య అన్నారు. రాష్ట్రంలో మల్టీపర్పస్ అసిస్టెంట్ పోస్టులు, జనరల్ మెడిసిన్ పోస్టులు పెద్ద సంఖ్యలో ఖాళీగా ఉన్నాయని ఆయన తెలిపారు. కార్యక్రమంలో అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రం ఆరోగ్య విభాగం ప్రతినిధి, ప్రజారోగ్య వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

చిల్ అవుట్







భానుడి ప్రతాపం నగర ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. రోజురోజుకూ పెరుగుతున్న ఉష్ణోగ్రతల నుంచి ఉపశమనం పొందేందుకు నగరవాసులు వివిధ మార్గాలను అన్వేషిస్తున్నారు. చల్లని పానీయాలు, తాటి ముంజెలు, పుచ్చకాయలు, ఐస్‌క్రీమ్‌లు, కూల్‌డ్రింక్‌లు, జ్యూస్‌లకు గిరాకీ పెరిగింది. నగరంలోని విదేశీ విద్యార్థులు సైతం పుచ్చకాయలు వంటి కాలానుగుణ ఫలాలను ఆస్వాదిస్తూ ఉపశమనం పొందుతున్నారు.

– ఫొటోలు : సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

కన్ను తెరిచిన గౌరీ శంకరుడు!



కుడి కన్ను తెరిచినట్లుగా కనిపిస్తున్న గౌరీ శంకరుడి విగ్రహం

అక్కిరెడ్డిపాలెం: గౌరీ శంకరుడు కుడి కన్ను తెరిచాడన్న వార్త దావానంలా వ్యాపించడంతో ఆటోనగర్‌లోని స్వయంభూ శ్రీ దుర్గా రామలింగేశ్వరాలయానికి భక్తులు పోటెత్తారు. ఆటోనగర్ బి–బ్లాక్‌లో భారత్ హెవీ ప్లేట్స్ అండ్ వెస్సెల్స్ (బీహెచ్‌పీవీ) గోడ పక్కన 1997లో ఈ ఆలయాన్ని నిర్మించారు. ఆదివారం సాయంత్రం ఓ భక్తుడు పూజ చేస్తున్న సమయంలో విగ్రహం కుడి కన్ను స్పష్టంగా తెరుచుకున్నట్లు గుర్తించారు. ఈ విషయాన్ని ఆలయ నిర్వాహకులకు చెప్పడంతో ఆశ్చర్యపోయారు. ఈ వార్తా దావానంలా వ్యాపించడంతో భక్తులు ఆలయానికి భారీగా క్యూ కట్టారు.

పుస్తకాలతో పోటీ ప్రపంచం



విద్య సముపార్జనలో తుది మైలు ఉపాధి. ప్రభుత్వ కొలువుపై యువతలో ఉన్న క్రేజే వేరు. తాజాగా డీఎస్సీ నోటిఫికేషన్ వెల్లడితో నిరుద్యోగ యువత పుస్తకాలతో కుస్తీని మరింత ముమ్మరం చేశారు. ఏయూ ఆర్ట్స్ కళాశాల పరిసరాలలో వందల సంఖ్యలో విద్యార్థులు పుస్తకాలతో సావాసం చేస్తున్నారు. వివిధ ఉద్యోగాలకు వీరు నిత్య సన్నద్ధులు. ఒక కుర్చీ, నాలుగు పుస్తకాలు ఇవే వీరి ఆస్తి. రాత్రి వేళలో సైతం వీరు ఇక్కడే ఉన్న వీధి దీపాల వెలుగులో ప్రిపరేషనే లోకంగా మార్చుకుంటున్నారు. తమ కలల సాకారంలో తలమునకలై ఉన్న పోటీ పరీక్షల అభ్యర్థులను సాక్షి తన కెమెరాలో బంధించింది.





– ఫొటోలు: సాక్షి, ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

సేవక.. సైనిక


శిక్షణ పొందుతున్న ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్ వింగ్స్


రిపబ్లిక్ డే వేడుకల్లో ప్రధాని మోదీకి పైలట్‌గా ఉన్న బుల్లయ్య విద్యార్థిని (ఫైల్)



సీతంపేట: విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో నేషనల్ క్యాడెట్ కార్ప్స్ (ఎన్‌సీసీ) ప్రత్యేక గుర్తింపు పొందింది. పాఠశాల, కళాశాల స్థాయి నుంచే విద్యార్థులను సైన్యంలో చేరేలా ప్రోత్సహించడం ఎన్‌సీసీ ముఖ్య ఉద్దేశం. యువతకు సైన్యం పట్ల అవగాహన కల్పించి, వారిని సైనిక స్థాయికి సిద్ధం చేసేందుకు 1948లో పండిట్ హెచ్‌ఎన్ కుంజ్రూ కమిటీ సూచనతో ఎన్‌సీసీ ఏర్పాటైంది. విశాఖ నగర పరిధిలోని డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కళాశాలలో 1991లో ఒక యూనిట్‌తో ప్రారంభమైన ఎన్‌సీసీ, ప్రస్తుతం ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్ విభాగాల్లో ఆరు యూనిట్లతో రాష్ట్రంలోనే అతిపెద్ద ఎన్‌సీసీ యూనిట్‌గా ఎదిగింది. ఎన్‌సీసీ శిక్షణతో విద్యార్థుల్లో దేశభక్తి, క్రమశిక్షణ, సేవాభావం, విపత్తు నిర్వహణ, నాయకత్వ లక్షణాలు, ఐకమత్యం అలవడతాయి. అలాగే, మానసిక, శారీరక ధారుఢ్యం మెరుగుపడటంతో పాటు ఉన్నత విద్య, ఉపాధి అవకాశాల్లో ప్రాధాన్యత లభిస్తుండటంతో ఇంటర్, డిగ్రీ, ఇంజనీరింగ్ విద్యార్థులు ఎన్‌సీసీలో చేరేందుకు ఆసక్తి చూపుతున్నారు.

దేశభక్తి, క్రమశిక్షణ, సేవా భావం అలవర్చేలా ఎన్‌సీసీ శిక్షణ

బుల్లయ్య కళాశాలలో ఆరు ఎన్‌సీసీ యూనిట్లు

రాష్ట్రంలోనే అతిపెద్ద ఎన్‌సీసీ యూనిట్ ఇక్కడే

33ఏళ్లుగా శిక్షణ

బుల్లయ్య కళాశాలలో 1991లో మొదటి ఎన్‌సీసీ ఆర్మీ యూనిట్ స్థాపించి శిక్షణ ప్రారంభించింది. ఆతర్వాత 2008లో ఎయిర్ వింగ్, 2009లో మరో ఆర్మీ వింగ్, 2009లో నేవీ బాయ్స్ వింగ్, 2015లో నేవీ గర్ల్స్ వింగ్, 2020లో నేవీ వింగ్‌తో విస్తరించారు. ప్రస్తుతం ఆర్మీ వింగ్‌లో 150 మంది, ఎయిర్ వింగ్‌లో100 మంది, నేవీ వింగ్‌లో 150 మంది శిక్షణ పొందుతున్నారు.

శిక్షణాంశాలు

ఆర్మీవింగ్‌లో తలసైనిక్, డ్రిల్, ఆబ్‌స్టికల్స్, కమ్యూనికేషన్, ఎయిర్‌వింగ్‌లో ఫ్లైయింగ్, ఏరో మోడలింగ్, నేవీ వింగ్‌లో నవసైనిక్, షిప్ మోడలింగ్, సీమెన్ షిప్ అంశాలలో శిక్షణ ఇస్తున్నారు. రెండు సంవత్సరాల శిక్షణ పూర్తి చేసిన విద్యార్థులకు 'బీ' సర్టిఫికెట్, మూడేళ్ల శిక్షణ పూర్తి చేసిన వారికి 'సీ' సర్టిఫికెట్ లభిస్తుంది.


వివిధ అంశాలలో శిక్షణ పొందుతున్న ఎన్‌సీసీ క్యాడెట్లు

సర్టిఫికెట్‌తో ఎన్నో ప్రయోజనాలు

ఎన్‌సీసీ బీ,సీ సర్టిఫికెట్‌తో ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాలలో ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యత కల్పిస్తోంది. సర్టిఫికెట్ ఉన్న క్యాడెట్లకు పీజీ కోర్సులలో ఒక్క శాతం రిజర్వేషన్, ఇంటర్ బైపీసీ, ఎంపీసీ విద్యార్థులకు నీట్, జేఈఈలో ఒక్క శాతం రిజర్వేషన్ లభిస్తుంది. జిల్లా స్థాయి రిపబ్లిక్ డే, ఇండిపెండెన్స్ డే వేడుకల్లో పరేడ్‌లో పాల్గొనే అవకాశం, ఉద్యోగాలలో మూడు శాతం రిజర్వేషన్, ఎస్‌ఎస్‌బీ ఆఫీసర్స్ జాబ్‌కి రాత పరీక్ష లేకుండా నేరుగా ఇంటర్వ్యూలో పాల్గొనే అవకాశం కల్పిస్తున్నారు. పోలీస్ ఉద్యోగాలలో 3 శాతం రిజర్వేషన్. అగ్నివీర్ ఎంపికలో 5 నుంచి 15 మార్కులు యాడింగ్, సీఆర్‌పీఎఫ్, ఎస్‌ఎస్‌ఎఫ్, సీఐఎస్ఎఫ్ ఎంపికలో ప్రాధాన్యత లభిస్తుంది.



రాష్ట్రంలోనే పెద్ద యూనిట్

రాష్ట్రంలోనే అతిపెద్ద ఎన్‌సీసీ యూనిట్ బుల్లయ్య కళాశాలలో ఉంది. ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్‌లో ఆరు యూనిట్లు ఉన్నాయి. ఆరు యూనిట్లకు ఆరుగురు ఎన్‌సీసీ ఆఫీసర్ల ఆధ్వర్యంలో బాల,బాలికలకు వేర్వేరుగా శిక్షణ ఇస్తున్నాం. 35 ఏళ్లల్లో వేలాది విద్యార్థులు శిక్షణ పొందారు. 2,337 మంది బీ సర్టిఫికెట్, 1,800 మంది సీ సర్టిఫికెట్ పొందారు. ఉత్తరాంధ్ర జిల్లాలతో పాటు, గోదావరి జిల్లాల నుంచి ఎన్‌సీసీ కోసం ఇక్కడకు వస్తుంటారు. రాష్ట్రంలో ఏ పోలీస్ స్టేషన్‌లో చూసినా బుల్లయ్య విద్యార్థి ఉంటారు. ఎన్‌సీసీ కోటాలో 46 నీట్ సీట్లు, రెండువేలకుపైగా ఇంజినీరింగ్ సీట్లు, పీజీ కోర్సులలో ఎంతో మందికి లబ్ధి చేకూరింది. స్టేట్ ఆర్‌డీసీ, ఇండిపెండెన్స్ పరేడ్‌లో బుల్లయ్య విద్యార్థులే సగం మంది పాల్గొంటారు. అలాగే విదేశాలలో జరిగే యూత్ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రామ్స్, ఢిల్లీలో జరిగే రిపబ్లిక్ డేలో ఏటా బుల్లయ్య విద్యార్థులు పాల్గొనడం కళాశాలకు గర్వకారణం.

– టి.బ్రహ్మానందరెడ్డి, మేజర్, ఎన్‌సీసీ, బుల్లయ్య కళాశాల

ఫ్లైయింగ్ ఆఫీసర్‌గా రాణిస్తా

ఎన్‌సీసీ ఎయిర్ వింగ్‌లో రెండేళ్ల శిక్షణ పూర్తి అయింది. బీ సర్టిఫికెట్ ఉంది. సీ సర్టిఫికెట్ కోసం శిక్షణలో పాల్గొంటున్నాను. ఎయిర్‌ఫోర్స్‌లో ఫ్లైయింగ్ ఆఫీసర్ కావాలన్నది నా జీవిత ఆశయం.

– పి.ప్రకాష్, ఇంజినీరింగ్ విద్యార్థి



ఆర్మీ ఆఫీసర్ అవుతా...

ఎన్‌సీసీ ఆర్మీ వింగ్‌లో బీ సర్టిఫికెట్ ఉంది. మరో ఏడాది శిక్షణ పూర్తయితే సీ సర్టిఫికెట్ వస్తుంది. ఎన్‌సీసీలో చేరడం వల్ల క్రమశిక్షణ, ఆరోగ్యం, సమయపాలన, సేవాభావం, మంచి ప్రవర్తన అలవడింది. డీజీపీ చేతుల మీదుగా బెస్ట్ కాగ్నిజెంట్ కమాండర్ అవార్డు అందుకున్నాను. ఆర్మీలో ఆఫీసర్ ఉద్యోగం సాధించలన్నది నా లక్ష్యం.

– ఎం.ఢిల్లీశ్వరి, బీఏ సెకండియర్ విద్యార్థిని



నౌ సైనిక్ క్యాంప్‌లో పాల్గొన్నా..

ఎన్‌సీసీ నేవీ వింగ్‌లో సీ సర్టిఫికెట్ వచ్చింది. ఆర్మీలో డిఫెన్స్ ఆఫీసర్ ఉద్యోగం సాధించాలని అనుకుంటున్నాను. రాత పరీక్ష లేకుండా సీడీఎస్, ఎస్ఎస్‌బీ ఎగ్జామ్‌కు డైరెక్ట్‌గా ఇంటర్వ్యూకు హాజరవ్వొచ్చు. మహారాష్ట్రలో 2023లో జరిగిన ఆల్ ఇండియా నౌ సైనిక్ క్యాంప్‌లో పాల్గొనడం ఆనందాన్నిచ్చింది.

– ఎ.విజయ్‌కుమార్, డిగ్రీ ఫైనలియర్



సమస్యల పరిష్కారంపై దృష్టి

- కలెక్టర్ హరేందిర ప్రసాద్
- పీజీఆర్ఎస్‌లో 402 వినతుల స్వీకరణ


అర్జీలు స్వీకరిస్తున్న అధికారులు

టీచర్స్ రోడ్డు : ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి, వాటికి శాశ్వత పరిష్కారం చూపాలని అధికారులను కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ స్వయంగా ఫిర్యాదుదారుల నుంచి అర్జీలు స్వీకరించారు. జిల్లా జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, జిల్లా రెవెన్యూ అధికారి భవానీ శంకర్, జీవీఎంసీ చీఫ్ సిటీ ప్లానింగ్ అధికారి ప్రభాకర్ కూడా వినతులు స్వీకరించారు. అర్జీదారుల సమస్యలు పూర్తిగా పరిష్కారమయ్యేలా చూడాలని ఆదేశించారు.

402 వినతుల స్వీకరణ

సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో మొత్తం 402 వినతులను అధికారులు స్వీకరించారు. వాటిలో రెవెన్యూ శాఖకు చెందినవి 173 ఉండగా, పోలీసు శాఖకు సంబంధించి 36, జీవీఎంసీ సంబంధించి 110 ఉన్నాయి. అలాగే ఇతర విభాగాలకు సంబంధించి 83 వినతులు వచ్చాయి.

పీజీఆర్ఎస్‌పై సమీక్ష

ప్రజా సమస్యల పరిష్కార వేదిక ప్రారంభానికి ముందు అధికారులతో కలెక్టర్ హరేందిర ప్రసాద్ సమీక్ష సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసెల్ సిస్టమ్‌కు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని కలెక్టర్ తెలిపారు. సీఎంవో, డిప్యూటీ సీఎంవో కార్యాలయాల నుంచి వచ్చే అర్జీలకు తక్షణమే శాశ్వత పరిష్కారం చూపాలని అధికారులను ఆదేశించారు. ప్రతిరోజు శాఖాపరమైన సమీక్షలు నిర్వహించాలని, అర్జీలు ఎక్కువగా ఉంటే ప్రత్యేక అధికారిని నియమించాలని సూచించారు. పింఛన్లు, భూ సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. హౌస్ హోల్డ్ సర్వేలో ఉద్యోగుల నమోదు వివరాలు వారం రోజుల్లో పూర్తి చేయాలని, విజన్ డాక్యుమెంట్ ప్రగతిని సమీక్షించాలని ఆదేశించారు. అర్జీదారులతో మాట్లాడి సమస్యలు పరిష్కరించాలని, పరిష్కరించిన తర్వాత ఫీడ్‌బ్యాక్ సేకరించాలని కలెక్టర్ సూచించారు.

ఏపీ ట్రాన్స్‌కో పోస్టుల భర్తీలో అక్రమాలు

ఏపీ ట్రాన్స్‌కోలో నిబంధనలకు వ్యతిరేకంగా ఉద్యోగుల భర్తీ జరుగుతోందని గాజువాకకు చెందిన జె.శ్రీలక్ష్మి ఆరోపించారు. రోస్టర్ విధానం (ఆర్‌వోఆర్) పాటించకుండా నియామకాలు చేస్తున్నారని, ఒక్కో పోస్టును రూ.10 లక్షలకు అమ్ముకుంటున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తనకు ఎక్కువ మార్కులు వచ్చినా డబ్బులు ఇవ్వలేదని, తనకంటే తక్కువ మార్కులు వచ్చిన వారికి డబ్బులు తీసుకుని ఉద్యోగాలు ఇస్తున్నారని వాపోయింది. ఈ విషయంపై విచారణ జరిపి తనకు న్యాయం చేయాలని ఆమె కలెక్టర్‌కు అర్జీ అందజేసింది.

గ్రామాన్ని వెలివేయడం తగదు


ఆందోళన చేస్తున్న దళిత సంఘాలు

మరణించిన విద్యుత్ కార్మికుడికి నష్టపరిహారం కోరినందుకు మళ్లం గ్రామాన్ని వెలివేసిన ఘటనపై కేసు నమోదు చేయాలని దళిత సంఘాలు డిమాండ్ చేశాయి. సోమవారం కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపిన అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. నష్టపరిహారం అడిగినందుకే గ్రామాన్ని వెలివేయడం దారుణమన్నారు. కుల బహిష్కరణకు పాల్పడిన వారిని అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వాన్ని గెలిపిస్తే తమపై దాడులు కొనసాగుతున్నాయని దళిత సంఘాల నేతలు ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక ఎమ్మెల్యే, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వెంటనే మళ్లం గ్రామాన్ని సందర్శించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

చూస్తాం.. అధికారుల దృష్టికి తీసుకెళ్తాం..

- దిగువస్థాయి సిబ్బంది సమాధానంతో అర్జీదారుల అసంతృప్తి
- తూతూ మంత్రంగా జీవీఎంసీ పీజీఆర్ఎస్


ఫిర్యాదులు స్వీకరిస్తున్న రమణమూర్తి

డాబాగార్డెన్స్: కుట్రలు..కుతంత్రాలతో నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారిని కూటమి నేతలు అవిశ్వాస తీర్మానం ద్వారా దించేశారు. మరోవైపు మూడు నెలలుగా కమిషనర్‌ను నియమించలేని దుస్థితి. ఓ అదనపు కమిషనర్ డిప్యూటేషన్‌పై తిరుమల తిరుపతికి బదిలీ అయ్యారు. ఈ నేపథ్యంలో సోమవారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక బోసిపోయింది. మరో అదనపు కమిషనర్ కూడా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు వెళ్లడంతో అర్జీలకు సమాధానం చెప్పే అధికారి కరువయ్యారు. కార్యక్రమాన్ని మమ అనిపించేశారు. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ముఖ్యంగా పట్టణ ప్రణాళికా విభాగానికి సంబంధించి సమస్యలు వెల్లువెత్తుతుంటాయి. ఆ సమస్యలు పరిష్కరించే అధికారులు (ఇద్దరు ఏసీపీలు తప్ప) లేకపోవడం గమనార్హం. ఎప్పటి మాదిరిగానే ఫిర్యాదులు స్వీకరించారు. చూస్తాం... సంబంధిత అధికారికి చెబుతాం అంటూ దిగువ స్థాయి సిబ్బంది అర్జీదారులకు సమాధానం చెప్పడంతో వారంతా అసంతృప్తి వ్యక్తం చేశారు.

పరిష్కార వేదికకు 73 వినతులు

జీవీఎంసీ ప్రజా సమస్యల పరిష్కార వేదికకు సోమవారం 73 ఫిర్యాదులు వచ్చాయి. అదనపు కమిషనర్ డీవీ రమణమూర్తి ఫిర్యాదులు స్వీకరించారు. జోన్ల వారీగా, ప్రధాన కార్యాలయానికి సంబంధించి వినతులు అందాయి. అత్యధికంగా పట్టణ ప్రణాళికా విభాగానికి 47 ఫిర్యాదులు వచ్చాయి. ఇతర విభాగాలైన అడ్మినిస్ట్రేషన్, రెవెన్యూ, ప్రజారోగ్యం, ఇంజనీరింగ్, మొక్కల విభాగానికి కూడా ఫిర్యాదులు అందాయి. కార్యక్రమంలో పలువురు జీవీఎంసీ అధికారులు పాల్గొన్నారు.

బ్లాక్‌మెయిల్ కేసు దర్యాప్తు వేగవంతం

సీతమ్మధార: ప్రైవేటు వీడియోలతో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి కుటుంబాన్ని బ్లాక్‌మెయిల్ చేస్తూ డబ్బులు డిమాండ్ చేస్తున్న కారు డ్రైవర్ అప్పలరాజును ద్వారకా పోలీసులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. అతడి వద్ద స్వాధీనం చేసుకున్న కారు యజమాని ఒక మహిళ అని సోమవారం గుర్తించారు. దీంతో పోలీసులు ఆమె నుంచి వివరాలు సేకరిస్తున్నారు. ఆమె తన కారును అప్పలరాజు పేరు మీద మార్చడానికి గల కారణాలను పోలీసులు ఆరా తీస్తున్నారు. పోలీసుల కథనం ప్రకారం, సీతమ్మధారలో నివాసముంటున్న సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ చేకూరి గిరీష్‌కు అంగవైకల్యం ఉండటంతో పిల్లలను చూసుకోవడానికి, ఇంటి పనుల కోసం రామెళ్ల అప్పలరాజును డ్రైవర్‌గా నియమించుకున్నారు. నమ్మకంగా ఉంటూ గిరీష్‌తో స్నేహం పెంచుకున్న అప్పలరాజు, ఒకరోజు అతన్ని హోటల్‌కు తీసుకెళ్లి అక్కడ ఒక అమ్మాయిని పరిచయం చేశాడు. వారిద్దరూ సన్నిహితంగా ఉన్న దృశ్యాలను తన మొబైల్‌లో చిత్రీకరించాడు. అనంతరం ఆ వీడియోల సాయంతో గిరీష్‌ను బ్లాక్‌మెయిల్ చేయడం ప్రారంభించాడు. అప్పలరాజు వేధింపులు ఎక్కువ కావడంతో గిరీష్ ద్వారకా పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టగా, సాయిబాబు ఆలయం సమీపంలో సౌండ్ రిపేర్ షాపు నడుపుతున్న అప్పలరాజుకు కొంతమంది అసాంఘిక శక్తులతో పరిచయం ఉన్నట్టు గుర్తించారు. దీంతో పోలీసులు అప్పలరాజును అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసును సీఐ బీ.వీ.రమణ దర్యాప్తు చేస్తున్నారు.

డ్రోన్ కెమెరాలతో గంజాయి ముఠా గుట్టు రట్టు

సీతమ్మధార: ద్వారకా పోలీస్ స్టేషన్ పరిధిలో సీఐ బీ.వీ.రమణ ఆధ్వర్యంలో డ్రోన్ల ద్వారా నిర్వహించిన తనిఖీలు సత్ఫలితాలనిచ్చాయి. ఆదివారం రాత్రి సీతమ్మధార కొండ ప్రాంతంలో డ్రోన్ కెమెరాల ద్వారా గాలిస్తుండగా, గంజాయి, ఇతర మాదక ద్రవ్యాలు సేవిస్తున్న ఐదుగురు యువకులు పట్టుబడ్డారు. పోలీసులు వారి నుంచి 50 గ్రాముల గంజాయితో పాటు నాలుగు సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. బిలాల్ కాలనీ, ప్రియదర్శిని కాలనీలకు చెందిన పైనా సాయి, మిండి ఆనంద్ , కోలా మురళీ, బొప్పా గణేష్, పవన్ కుమార్ లను నిందితులుగా గుర్తించి, వారికి 41 సీఆర్‌పీసీ నోటీసులు జారీ చేశారు. ఈ కేసును సీఐ రమణ స్వయంగా దర్యాప్తు చేస్తున్నారు.

లైంగిక దాడి కేసులో ప్రధాన నిందితుడి అరెస్ట్

సీతమ్మధార: నగ్న చిత్రాలు తీసి బెదిరిస్తూ లైంగికదాడులకు పాల్పడిన ముఠాలో ప్రధాన నిందితుడు రవీంద్ర యాదవ్‌ను సోమవారం అరెస్టు చేసినట్టు ఫోర్త్ టౌన్ సీఐ సత్యనారాయణ తెలిపారు. పరారీలో ఉన్న మరో ఐదుగురు నిందితుల కోసం గాలిస్తున్నట్టు చెప్పారు. దాదాపు 30 మంది మహిళల నగ్న చిత్రాలు స్టోరేజ్ చేసుకుని వారి జీవితాలతో ఆడుకుంటున్న మ్యారేజ్ బ్యూరో ముఠాపై ఫోర్త్ టౌన్ పోలీసులకు ఫిర్యాదు అందిన విషయం తెలిసిందే. అయితే ఫిర్యాదు చేసినా నాలుగు రోజులు గడుస్తున్నా దర్యాప్తులో పురోగతి లేదని ఓ బాధితురాలు ఆవేదన వ్యక్తం చేసింది. నగ్న వీడియోలు బయటపెడతారని భయపడి మొదట ఫిర్యాదు చేయడానికి వెనుకాడిన బాధితుల్లో ఒకరు ధైర్యంగా ముందుకొచ్చి పోలీసులను ఆశ్రయించిన విషయం తెలిసిందే.

1.8 గ్రాముల డ్రగ్స్ స్వాధీనం

టీచర్స్ రోడ్డు: లఅక్రమంగా డ్రగ్స్ విక్రయిస్తున్న ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకుని, అతడి నుంచి డ్రగ్స్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మూడో పట్టణ పోలీసులు తెలిపిన వివరాలు.. మద్దిలపాలెం ప్రాంతంలో డ్రగ్స్ అమ్మకాలపై అందిన సమాచారంతో ఆదివారం రాత్రి పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో సీఎంఆర్ వెనుక బాల గంగాధర్ వద్ద 1.8 గ్రాముల డ్రగ్స్‌ను గుర్తించారు. దాన్ని స్వాధీనం చేసుకోవడంతోపాటు, గంగాధర్‌ను అదుపులోకి తీసుకున్నారు. కేసు దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు సీఐ పైడయ్య తెలిపారు.

పోప్ ఫ్రాన్సిస్ మృతిపై ఆర్చ్ బిషప్ సంతాపం


పోప్ ఫ్రాన్సిస్‌తో ఆర్చ్ బిషప్ ఉడుముల బాల శౌరిరెడ్డి(ఫైల్)

డాబాగార్డెన్స్: పోప్ ఫ్రాన్సిస్ మరణం పట్ల విశాఖపట్నం ఆర్చ్ బిషప్ ఉడుముల బాలశౌరిరెడ్డి తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. పోప్ మరణం చర్చ్, సమాజానికి తీరని నష్టమన్నారు. పోప్‌తో తనకున్న వ్యక్తిగత అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. పాపసీ ప్రతిరూపాన్ని మార్చిన వినయపూర్వక నాయకుడిగా ఆయనను అభివర్ణించారు. ఉక్రెయిన్-రష్యా, ఇజ్రాయిల్-పాలస్తీనాలో శాంతిని స్థిరంగా సమర్థించారని పేర్కొన్నారు. 2013లో పోప్ ఫ్రాన్సిస్ నియమించిన మొదటి భారతీయ బిషప్ తానేనని, ఇటీవల పోప్ తనను విశాఖపట్నం ఆర్చ్ బిషప్‌గా కూడా నియమించారని తెలిపారు. అంత్యక్రియల ప్రక్రియ పూర్తయిన తర్వాతి నెలలో కార్డినల్స్ సమావేశం నిర్వహించి కొత్త పోప్‌ను ఎన్నుకోనున్నట్లు వెల్లడించారు.

ప్రైవేట్ స్కూళ్లలో ఉచిత సీట్లకు దరఖాస్తులు

విశాఖ విద్య: ప్రైవేట్ పాఠశాలల్లో పేదవర్గాలకు చెందిన అర్హులైన విద్యార్థులు ఒకటో తరగతిలో ఉచిత ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని డీఈవో ఎన్.ప్రేమ్‌కుమార్ తెలిపారు. ఈ నెల 28 నుంచి మే 15 వరకు దరఖాస్తుకు అవకాశం కల్పిస్తున్నామన్నారు. సమీపంలో ఉన్న సచివాలయాల్లో కూడా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

నేటి నుంచి రైల్వే వేసవి క్రీడా శిక్షణా శిబిరాలు

విశాఖ స్పోర్ట్స్: తూర్పు కోస్తా రైల్వే స్పోర్ట్స్ సంఘం (ఈకోర్సా) వాల్తేర్ ఆధ్వర్యంలో మంగళవారం నుంచి 40 రోజుల పాటు వేసవి క్రీడా శిబిరాలు జరగనున్నాయి. ఐదేళ్ల నుంచి 15 ఏళ్ల చిన్నారులకు ప్రతీ రోజు రెండు సెషన్స్‌గా శిబిరాలు నిర్వహించనున్నారు. బాక్సింగ్, బాస్కెట్‌బాల్, బాల్‌బ్యాడ్మింటన్, ఫుట్‌బాల్, బ్యాడ్మింటన్, స్కేటింగ్, స్విమ్మింగ్, టేబుల్ టెన్నిస్, టెన్నిస్, వాలీబాల్‌తో సహా అథ్లెటిక్స్‌లో బాలబాలికలకు శిక్షణ ఇవ్వనున్నారు. ఆసక్తి గల రైల్వే ఇండోర్ స్టేడియంలో పేర్లు నమోదు చేసుకోవచ్చని నిర్వాహకులు తెలిపారు. ఈ శిబిరాల పోస్టర్‌ను డీఆర్ఎం లలిత్ బోహ్రా సోమవారం విడుదల చేశారు. రైల్వే ఉద్యోగుల పిల్లలతో పాటు నగరంలో నివసించే వారి పిల్లలకు ప్రవేశం కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఏడీఆర్ఎంలు మనోజ్ కుమార్, శాంతారాం, క్రీడాధికారి హరనాథ్, క్రీడాసలహాదారు మోహ్రానా, కార్యదర్శి ఉష పాల్గొన్నారు.

నేపాల్‌లో మిస్సయిన యువతి తుంగ్లాంలో ప్రత్యక్షం


యువతి అనూషకబమ్‌ను కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న గాజువాక పోలీసులు

అక్కిరెడ్డిపాలెం: నేపాల్‌లో తప్పిపోయిన యువతిని గాజువాక పోలీసులు కుటుంబ సభ్యులకు అప్పగించారు. సౌత్ ఏసీపీ త్రినాథ్ సోమవారం తెలిపిన వివరాల ప్రకారం, నేపాల్‌లోని కాట్‌మాండ్‌కు చెందిన లాల్ బహదుర బన్ కుమార్తె అనూషకబమ్ ఈ నెల 11న కనిపించకుండా పోయింది. దీంతో ఆయన స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తులో భాగంగా అనూషకబమ్ గాజువాక పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్నట్లు కాట్‌మాండ్ పోలీసులు గుర్తించారు. ఆమె ఆచూకీ కోసం అక్కడి ఎస్ఐ అర్జున్, యువతి తండ్రి లాల్ బహదూర్‌బమ్‌తో కలిసి విశాఖ వచ్చి పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చిని కలవగా, ఆయన ఆదేశాల మేరకు గాజువాక సౌత్ సబ్ డివిజన్ ఏసీపీ టి.త్రినాథ్ సూచనలతో గాజువాక ఎస్ఐ నజీర్, సిబ్బంది తుంగ్లాంలో అనూషకబమ్‌ను గుర్తించారు. అనంతరం ఆమెను గాజువాక పోలీస్ స్టేషన్‌కు తరలించి, ఎస్ఐ నజీర్ అక్కడి ఎస్ఐ అర్జున్ సమక్షంలో ఆమె తండ్రి లాల్ బహదూర్‌బమ్‌కు యువతిని అప్పగించారు.

విశాఖ బులియన్

24 క్యారెట్స్(10 గ్రా.)	రూ.98,350
22 క్యారెట్స్(10 గ్రా.)	రూ.90,150
వెండి(కిలో):	రూ.1,11,000

చికెన్ ధరలు



చికెన్ (కిలో)	
ఫారం :	రూ.100
(వెన్‌కాబ్)	
బ్రాయిలర్ (లైవ్):	రూ.120
స్కిన్ :	రూ.210
స్కిన్‌లెస్ :	రూ.220